శ్రీ శనైశ్చర కృత

శ్రీలక్ష్మీనృసింహస్తోత్రము



శ్లో॥ సులభో భక్తియుక్తానాం దుర్దర్శో దుష్టచేతసామ్ ।
అనన్యగతికానాం చ ప్రభుర్ భక్తైక వత్సలః ॥ 1

తాత్పర్యము: శ్రీ నృసింహదేవుఁడు భక్తి గలవారికి తొందఱగా వశమగువాఁడు ను, చెడ్డబుద్ధి గలవారికి దర్శనమివ్వనివాఁడును, వేఱుగతి లేని అనాథులకు శరణ్యుఁడును, భక్తుల యందే వాత్సల్యము గలవాఁడును అయి ఉన్నాఁడు.

శ్లో॥ శనైశ్చరస్ తత్ర నృసింహదేవ, స్తుతిం చకారాఽ మల చిత్తవృత్తిః ।
ప్రణమ్య సాష్టాంగ మశేషలోక, కిరీట నీరాజిత పాదపద్మమ్ ॥ 2

తాత్పర్యము: అంతట శనీశ్వరుఁడు లోకేశులందఱి కిరీటకాంతుల చేత నీరాజన

మివ్వఁబడినట్లున్న పాదపద్మములు గల ఆ నృసింహదేవుని సమీపించి సాష్టాంగ ప్రణామము నాచరించి నిర్మలమైన మనస్సుతో ఆయన నిట్లని స్తోత్రము చేసెను.

శ్లో॥ యత్పాద పంకజ రజః పరమాదరేణ,
సంసేవితం సకల కల్మష రాశినాశమ్ ।
కల్యాణకారక మశేష నిజానుగానాం,
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 3

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! ఏ దేవుని పద్మములవంటి పాదముల ధూళిని పరమభక్తితో సేవించినచో భక్తులందఱి పాపముల ప్రోవులును నాశనమై శుభములు చేకూడునో అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ సర్వత్ర చంచలతయా స్థితయా హి లక్ష్మ్యా
బ్రహ్మాది వంద్య పదయా స్థిరయా న్యసేవి ।
పాదారవింద యుగళం పరమాదరేణ
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 4

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! బ్రహ్మాది దేవతలకు వందనీయురాలై నను, అన్నిచోట్ల చంచలముగానే ఉండు లక్ష్మీదేవి నీ పాదారవింద ద్వయమును మాత్రము వదలక ప్రేమతో స్థిరముగా నాశ్రయించుకొని యున్నది. అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ యద్రూప మాగమ శిరః ప్రతిపాద్యమాద్యం
ఆధ్యాత్మికాది పరితాపహరం విచింత్యమ్ ।
యోగీశ్వరై రపగతాఖిల దోషసంఘైః
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 5

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా! ఏ దేవుని రూపము శాస్త్రముల చేత అన్నింటి కంటెను తొలుత ప్రతిపాదింపఁబడి, పాపరహితులైన గొప్ప యోగులకు ధ్యానవస్తువై ఆధిభౌతికాది తాపత్రయమును వదిలింపఁజాలునో అట్టి నీవు నా యందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ ప్రహ్లాద భక్తవచసా హరి రావిరాస
స్తంభే హిరణ్యకశిపుం స ఉదారభావః ।
ఊర్వోర్ నిధాయ తదురో నఖైర్ దదార
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 6

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! నీ భక్తుఁడైన ప్రహ్లాదుని మాటకు దయ తో సమ్మతించి, స్తంభమునందుండి ఉద్భవించి, ఆతని తండ్రియగు హిరణ్యకశి పుని తొడల మీఁద పెట్టుకొని నీ వాఁడిగోళ్ళతో వాని శరీరమును చీల్చినావు. అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ యో నైజభక్త మనలాంబుధి భూధరోగ్ర
శృంగ ప్రపాత విషదన్తి సరీసృపేభ్యః ।
సర్వాత్మకః పరమ కారుణికో రరక్ష
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 7

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! సర్వాంతర్యామియైన ఏ దేవుఁడు తన భక్తుఁడైన ప్రహ్లాదుని అగ్నిలో కాలకుండ, సముద్రములో మునుఁగకుండ, కొండ శిఖరముల నుండి పడి పచ్చడి కాకుండ, ఏనుఁగులు మున్నగు వన్యజంతువులు మట్టగింపకుండ, పాములు కఱవకుండ పరమ దయామయుఁడై రక్షించెనో అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ యన్నిర్వికార పరరూప విచింతనేన

యోగీశ్వరా విషయ వీత సమస్త రాగాః ।
విశ్రాంతి మాపు రవినాశవతీం పరాఖ్యాం
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 8

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! ఏ దేవుని నిర్వికారమైన పరతత్త్వము గా ధ్యానించి గొప్పయోగులు విషయాసక్తి మఱియు సమస్త రాగద్వేషములను తెగినవారై అక్షయ్యమైన పరమశాంతిని పొందినారో అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ యద్రూప ముగ్ర పరిమర్దని భావశాలి
సంచింతనేన సకలాఘ వినాశకారి ।
భూత జ్వర గ్రహ సముద్భవ భీతినాశం
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 9

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా ! ఏ దేవుని రూపమును భావయుక్తము గా ధ్యానించుట చేత రక్షఃపిశాచ బాధలును, పాపములును, జ్వరాది వివిధ రోగ ములును, బాలగ్రహాది పీడలును, తన్మూలకమైన భయములును నశించునో అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రసరింపవలసినది.

శ్లో॥ యస్యోత్తమం యశ ఉమాపతి పద్మజన్మ
శక్రాది దైవత సభాసు సమస్త గీతమ్ ।
శక్త్యైవ సర్వశమం ప్రశమైకదక్షం
స త్వం నృసింహ మమ దేహి కృపావలోకమ్ ॥ 10

తాత్పర్యము: హే భగవాన్ శ్రీనారసింహా ! ఏ దేవుని ఉత్తమకీర్తి కైలాసముననను, సత్యలోకముననను, స్వర్గలోకముననను దేవసభలలో ఎల్లఱిచేత గానము చేయఁబడి తనదైన నైసర్గికశక్తి చేతనే అన్ని పీడలను శమింపఁజేయఁజాలినదై ప్రశాంతిని

సహిత మనుగ్రహింపఁగలదో అట్టి నీవు నాయందు నీ కృపాకటాక్షమును ప్రస రింపవలసినది.

శ్లో॥ ఇత్థం శ్రుత్వా స్తుతిం దేవః శనినా కల్పితాం హరిః।
ఉవాచ బ్రహ్మబృందస్థం శనిం తం భక్తవత్సలః॥ 11

తాత్పర్యము: బ్రహ్మాది దేవతలతో కలిసి శని తన పరముగా కావించిన స్తోత్రము నవధరించి భగవంతుఁడైన శ్రీ నృసింహస్వామి భక్తవత్సలుఁడు కావున ఆతనితో నిట్లనెను.

శ్రీ నృసింహ ఉవాచ :- అంతట శ్రీనృసింహస్వామి పలికెను.

శ్లో॥ ప్రసన్నోఽ హం శనే తుభ్యం వరం వరయ శోభనమ్।
యద్వాంఛసి తదేవ త్వం సర్వలోక హితావహమ్॥ 12

తాత్పర్యము: ఓ శనైశ్చరా ! నీవు భక్తితో చేసిన స్తోత్రమునకు నీ యెడల సంతుష్టుఁడనైతిని. నీవు మనసులో ఏమి కోరుచున్నావో ఆ వరమునే వేఁడుము, ప్రసాదించెదను. అది లోకులందఱికిన్ని శ్రేయస్కరము కావలెను సుమా !

శనైశ్చర ఉవాచ :- అంతట శనీశ్వరుఁడు పలికెను.

శ్లో॥ నృసింహ త్వం మయి కృపాం కురు దేవ దయానిధే।
మద్వాసర స్తవ ప్రీతికరః స్యాద్ దేవతాపతే॥ 13

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా! దయాసాగరా! దేవాధిదేవా! నా వారము (శనివారము) నీకు ప్రీతికరమగునట్లు వరమనుగ్రహింపవలసినది.

శ్లో॥ మత్కృతం త్వత్పరం స్తోత్రం శృణ్వంతి యే పఠంతి చ।

సర్వాన్ కామాన్ పూరయేథాస్ తేషాం త్వం లోకభావన॥ 14

తాత్పర్యము: హే భగవన్ శ్రీనారసింహా! లోకభావనా ! నీ పరముగా నేను చేసిన యీ స్తోత్రమును ఎవరైతే వినెదరో మఱియు చదివెదరో అట్టివారికి గల అన్ని కోరికలను నీవు దయతో తీర్పవలసినది స్వామీ !

శ్రీ నృసింహ ఉవాచ :- అంతట శ్రీనృసింహస్వామి పలికెను.

శ్లో॥ తథైవాఽ స్తు శనేఽ హం వై రక్షో భువన సంస్థితః।
భక్తకామాన్ పూరయిష్యే త్వం మమైకం వచః శ్రుణు॥ 15

తాత్పర్యము: శనైశ్చరా! అట్లే కానిమ్ము. నీవు కోరినట్లే అట్టి భక్తుల కోరికలను నేనీ రక్షోలోకమునందుండి తీర్చెదను. నాది మఱియొక మాట కలదు. వినుము.

శ్లో॥ ద్వాదశాష్టమ జన్మస్థాత్ త్వద్భయం మాఽ స్తు తస్య వై।
శనిర్ నరహరిం దేవం తథేతి ప్రత్యువాచ హ॥
తతః పరమ సంతుష్టా జయేతి మునయోఽ వదన్॥ 16

తాత్పర్యము: అది ఏమనఁగా– నన్నీ స్తోత్రముతో కొనియాడినవారికి నీవు ఎనిమిదవ, పండ్రెండవ ఇళ్ళలో నుండుట వలని భయము కూడా ఉండదు. (అనఁగా, అట్టివారికి తక్కిన స్థానములందలి శని ఇంకను ఉపేక్షణీయుఁడని భావము) అంతట శనైశ్చరుఁడాయన మాటలకు “సరియే” అని అంగీకరించెను. ఆ సంవాదమును విన్న మునులు సంతుష్టాంతరంగులై జయజయధ్వానములు చేసిరి.

(ధర్మరాజం ప్రతి) శ్రీకృష్ణ ఉవాచ :- ఈ కథ చెప్పి శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతో నిట్లనెను.

శ్లో॥ శనైశ్చరస్యా ఽ థ నృసింహదేవ, సంవాదమేతత్ స్తవనం చ మానవః ।
శ్రుణోతి యః శ్రావయతే చ భక్త్యా, సర్వాణ్యభీష్టాణి చ విందతే ధ్రువమ్ ॥

తాత్పర్యము : ఏ మానవుఁడైతే శ్రీనృసింహస్వామికిని శనైశ్చరునికిని నడుమ జఱిగిన ఈ సంభాషణమును మఱియు స్తోత్రమును భక్తితో వినునో, లేక ఇతరులకు వినిపించునో అట్టివానికి గల అన్ని కోరికలును సిద్ధించును. ఇది తథ్యము.

॥ ఇతి శ్రీ భవిష్యోత్తర పురాణే రక్షో భువన మాహాత్మ్యే శనైశ్చర కృతం
నృసింహ స్తోత్రం సంపూర్ణమ్ ॥

(ఇట్లు శ్రీ భవిష్యోత్తర పురాణములో రక్షోభువన మాహాత్మ్యమను ఘట్టమున
శనైశ్చర ప్రణీతమగు శ్రీనృసింహస్తోత్రము సమాప్తము)

॥ సర్వం శ్రీకృష్ణార్పణమస్తు ॥